# వాన

## వి.వి.బి.రామారావు

ప్రదోషవేళ కావస్తోంది. ఆకాశమంతా చీకట్లు కమ్ముతున్నాయి అప్పటంగా ఉరుములు. కష్ట చీకట్లు కమ్మించే తటిల్లతలు. ఏ క్షణాన్నయినా కుండపోత ప్రారంభమయ్యేటట్టుంది.

అకాల వర్షం. బంగాళాఖాతంలో వాయుగుండమేమో! వార్తల్లో ఏమీ చెప్పినట్టు లేదు.

చల్లటి గాలి ప్రారంభమయింది.

కొద్ది నిముషాలలో ఇకముందుకు పోవడం అసాధ్యమయ్యేలా ఉంది.

నరసింహం చుట్టూ చూశాడు. గాలివానలో చెట్టు నీడన ఉండడం కంటె ఏ ఇంటి గుమ్మంమీదో తలదాచుకోవడం మేలనిపించింది.

ఎదురుగా పెద్ద లోగిలి. బయట పెద్ద గేటు. చుట్టూ తోట. మధ్యలో ఇల్లు. ఆ ఇల్లు ఎవరిదో నరసింహానికి తెలుసు కాని ఆ ఇంటిగలాయనను చూడడం పడలేదు. ఆయనను చూడడానికి ఇది ఒక అవకాశమేమో!

జిగ్గున మెరుపు మెరిసింది. గేటు కొక్కేంవేసి వరండావరకూ నడిచాడు. ఫెళ్ళున ఉరుము ఉరిమింది.

ముక్తావిద్రుమ హేమ నీలధవళ
చ్ఛాయైర్ముఖై స్త్రీక్షణై
ర్యుక్తా మిన్దు నిబద్ధ మకుటాం
తత్త్వార్థ వర్ణాత్మికాం...

ఉరుముల హోరు ఎక్కువైంది. లోపలనుంచి సంధ్యావందన శ్లోకాలు వినవస్తున్నాయి.

వాన మొదలైంది. సన్నటి జల్లువంక కన్నార్పకుండా మైమరచి చూస్తున్నాడు నరసింహం.

వెనక అలికిడయి చటుక్కున వెనుదిరిగి చూశాడు. కుంకుమబొట్టు— నుదుటున ఏదో ప్రకాశం - ఛాతీమీద శాలువ. పాట్నాలు ఒకేపంచ ఎదురయ్యాయి.

"నమస్కారం!" పలకరింపు ఆయనదే

నరసింహం తేరుకునేలోగా "కూచోండి వస్తా!" అంటూ ఆయన లోపలకు వెళ్ళారు.

వరండామీద వున్న కుర్చీలవంకా, గోడకున్న బొమ్మలవంకా చిన్న గాజు బీరువాలో ఉంచబడ్డ ప్రతిమవంకా చూస్తున్నాడు వానకు తలదాచుకోడానికి వచ్చిన నడివయసు మనిషి.

ఈ ఇల్లు దేశవిఖ్యాతి గాంచిన శాస్త్రజ్ఞుడిదని తెలుసు. ఆయన ఆ ఊళ్ళోనే - నరసింహం పనిచేస్తున్న కాలేజీలోనే చదువుకున్నాయననీ అతనికి తెలుసు.

ద్వారం ముందు తెర.

వెనక్కి తిరిగి జాబిరీగుండా తాను వచ్చిన దోవవంకే చూస్తూ వానకి తృప్తిగా తడుస్తున్న చెట్టువంక చూస్తున్నాడతను.

ప్రొఫెసర్ శర్మగారు — ఆ ఇంటిగలాయన బహుశః తను పుట్టక పూర్వం అక్కడ చదువుకుని ఉండవచ్చు. అంత చదువులు చదివి, అన్ని దేశాలు చూసి, అంతలేసి పదవులు చేపట్టి విశేష గౌరవాలని అందుకున్న అంతటి శాస్త్రవేత్త ఆ ఊళ్ళో స్థిరపడాలనుకోడంలో ఏదో విశేషం ఉండాలి.

శాలువా ఆయన శాస్త్రజ్ఞుడిలా కనపడలేదు. శుద్ధ శ్రోత్రియుడైన బ్రాహ్మణుడిలా ఉన్నారు. బహుశః వారి బంధువేమో!

ఇంతకీ ముందుగా అనుమతి తీసుకోకుండా వచ్చాడే ఆయనతో మాటాడడం కుదురుతుందా? ఆయనసలు ఇంటిలో ఉన్నారో లేరో!

కారు షెడ్డులో దుమ్ము కొట్టుకుపోయి ఉంది.

"క్షమించాలి... లోపల ..." అంటూ శాలువా ఆయన బయటకు వచ్చారు.

"నమస్కారం! నా పేరు నరసింహం. నేను ఇక్కడ కాలేజీలో పని చేస్తున్నాను...ఇక్కడే చదువుకున్నాను. ప్రొఫెసర్ శర్మగారిని చూడాలని వచ్చాను.

"సంతోషం."

"వారు....?"

"వారెవరు?"

"శర్మగారు...."

"ఒక్క నిముషం...." మళ్ళీ లోపల కెళ్ళారాయన. కొద్ది క్షణాలలో కాఫీ కప్పు తీసుకుని వచ్చారు ఒక ట్రేలో.

మరొక మెరుపు. వెంబడే పెద్ద ఉరుము.

"క్షమించాలి...ఆయన చాలా పెద్దవారు...ముందుగా చెప్పకుండా వచ్చాను."

"ఫరవాలేదు....ముందు తీసుకోండి!"

ఆయన తనవంకే చూస్తూ ఉండే కాఫీ చప్పరించాడు నరసింహం. కాఫీ తాగడం అయిపోయేవరకు ఆయన ఏమీ మాటాడలేదు.

"వారు....?" మళ్ళీ అడిగాడు నరసింహం, కాఫీకప్పు కిందపెడుతూ.

ఇల్లులోనే తోటపని చేస్తున్నాయన పూలు పట్టుకుని మెట్లెక్కాడు.

"మీకు పూలంటే అంత మక్కువ. మీ చేతుల్లోనూ అవి కొమ్మమీద ఉన్నంత ఆనందంగానూ ఉన్నాయి..."

"మీ మనసు అలాంటిది." పూలు కోసుకొచ్చినాయన లోపలకు వెళ్ళి పోయాడు.

"వారేనా శర్మగారు?"

"మీరు మాటాడాలనుకుంటున్న శర్మని నేనే"

వాన ఉధృతమైంది. నరసింహం కొంచెం తబ్బిబ్బు పడ్డాడు.

"మనం అన్నదమ్ములం. ఒకే తల్లి ఒడిలో పెరిగిన బిడ్డలం. మా నాన్న గారు ఇక్కడికి పదిమైళ్ళ దూరంలో ఓ గ్రామంలో ఉండేవారు. ఈ ఇల్లు మా చదువులకోసమని కట్టించిందే....రోజులు బాగా మారాయి....లోపలకు వస్తే నాకు తెలిసిన వాళ్ళెవరూ లేరని బయటనుంచే కాలేజీని చూస్తూ ఉంటాను...."

"తమరు ప్రొఫెసర్ శర్మగారని నేను గ్రహించలేకపోయాను క్షమించాలి."

"ఇందులో మీ తప్పేమీలేదు....ఉండండి" అంటూ లోపలనుంచి ఒక పెద్ద ఫోటో ఆల్బం తీసుకొచ్చారాయన.

నరసింహం ఆ ఆల్బం చూస్తుండగా ఆయన మళ్ళీ లోపలికి వెళ్ళారు.

ఒక్కొక్క ఫోటోవంకా జాగ్రత్తగా ఒకొక్క కళాఖండం వంక చూస్తు

న్నట్టు తదేక దీక్షతో చూస్తూ వుంటే కాలగమనం దృష్టిలోనే లేదతనికి.

మనసులో ఏవేవో ప్రశ్నలు.

"అణుశక్తి పరిశోధనలో తమరు...." ఆయన రాగానే అడిగాడు.

"ఏదో కొద్దిమాత్రం కృషి చేశానుకోండి. కాని శాస్త్ర పరిజ్ఞానం జన సామాన్యానికి ఉపయోగపడి, మన జీవన విధానాన్ని వెలుగు పుంతలవంక నడపాలి.... నా మాటకేంలెండి ...మీ గురించి నాకేమి తెలియదు.... ఒక కాలేజీలో చదువుకున్నవాళ్ళం. మీరు..."

ఆయనను మరేమీ మాటాడనివ్వకుండా నరసింహం వెంటనే అందుకున్నాడు.

"మహా మేధావులు మీరు...ఆధునిక శాస్త్రాలని ఔపాసన పట్టారు...."

"మీరు ఏ శాఖలో పని చేస్తున్నారు?"

"ప్రాగ్భాషా విభాగంలో సామాన్యమైన అధ్యాపకుడిని..."

"చాలా సంతోషం....అడబోయిన తీర్థం ఎదురైంది. నా అదృష్టం.... సౌందర్యలహరిలో ఆదిశంకరుల భావన గురించి మీ దగ్గరనుంచి తెలుసుకోవాలని ఉంది."

"మహాపురుషుడు. దైవశక్తి సంపన్నుడు ...మేధావి....అలౌకిక ప్రజ్ఞా పాటవం గలిగిన మహామనిషి. శంకర భగవత్పాదుల జీవితమే ఒక పురాణం... కారణజన్ములు వారు... పెద్దలు మీకు తెలియనిదేమీ కాదు ...శివశక్తుల ఐక్యతని పలువిధాలుగా ఐహ రమ్యంగా సామాన్యులకు సహితం గుండెలకు హత్తుకునేలా మహా నిష్టాతత్పరులకు అనుభవ నైవేద్యంగా అందించిన తత్త్వవేత్త ఆయన...."


శర్మగారు నరసింహంవంక తదేకంగా చూస్తూ ఉండడంతో నరసింహం కళ్ళు తిప్పుకున్నాడు.

"మా రోజుల్లో కాలేజీకి చదువులకీ ఇప్పటివాటికీ పోలికలేదు. విద్యార్థులుగా ఏదో మా లోకంలో ఉండేవాళ్ళం. మాకు క్రికెట్ తెలీదు...సినిమాలు లేవు. రేడియోలు ఊరంతటికీ ఒకటి అరా అదీ నేను కాలేజీలో ఉండగా వచ్చాయో లేదో...."

"మీరన్నది అక్షరాలా నిజం....కాని వీటిని విద్యావ్యాప్తి సాధనాలుగా వాడే రోజులివి ...అంతా మనం ఉపయోగించుకునే విధానంలో ఉంటుంది. పరికరాలు పరికరాలే!"

"సంస్కృతీ, ఆచారం, ధర్మం...వీటినుంచి మన యువత మరెటో మళ్ళిపోతోంది...దీనికి కారణం విలువలు దిగజారిపోవడమే! విలువలు మారడం సహజం కాని దిగజారడం దౌర్భాగ్యమే కదా! ఏది ముఖ్యం అనే విషయంలో మన యువతరం తప్పుదోవ పడుతుందనిపిస్తోంది. ఇంతకీ మీకు విసుగు కలిగిస్తున్నట్టున్నాను...."

"మీ దర్శనం చెయ్యాలని ఎన్నాళ్ళనుంచో అనుకుంటున్నాను...."



"ఏదో పాతకాలం మనిషిని....వయసుతో పెరుగుతుంది చాదస్తం....రండి...రండి...మూర్తిగారూ....నమస్కారం! నమస్కారం...వీరు మూర్తి గారని అటవీశాఖలో పనిచేసి రిటైరైపోయారు నాకు ఆప్తులు...వీరు నరసింహంగారు కాలేజీలో అధ్యాపకులు...."

లోపల ఫోన్ మోగింది. శర్మగారు లోపలికి వెళ్ళారు మూర్తిగారితో ఏదో మాటాడుతూ ఉన్న నరసింహం లోపలనుంచి వినపడుతున్న శర్మగారి మాటలూ అక్కడా అక్కడా వింటున్నాను.

"....అమ్మలేదు....అంతా క్షేమమే....అక్కయ్య దగ్గరకు వెళ్ళింది....అంతా మన ఇష్టం కాదు కదా...దైవేచ్ఛ....పిల్లలు బాగున్నారా....మీ ఆరోగ్యం జాగ్రత్త."

కొంతసేపయ్యాక శర్మగారు బయటకు వచ్చారు....

క్షమించాలి....వాన తగ్గేటట్టు లేదు....వాళ్ళు నాకోసం చూస్తూ ఉంటారు. మొన్న చెప్పాను కదా....వాళ్ళ లేబరేటరీ మీరు చూడాలని ఆశ పడుతున్నారు....మీకు వీలయితే ..." మూర్తిగారు అడిగారు.

"మీకు తెలుసుగా నే చెప్పే సమాధానం!"

"అంతేననుకోండి...అయినా మరొక్కసారి..."

"ఇప్పటికే చాలా కాలయాపన జరిగిపోయింది రేపు మనది కాదు. అబ్బాయి అక్కడికి రమ్మంటున్నాడు...నాకు వెళ్ళాలని లేదు....ఎక్కడికీ వెళ్ళాలనిపించదు...ముసలి ఎద్దుకి ఇక కావాల్సింది...ఆ రోజు కోసం నిరీక్షణే కదా..."

"మరి నాకు శలవిప్పించండి...." అంటూ మూర్తిగారు వెళ్ళిపోయారు.

"మీ అబ్బాయి...."

"లాస్ఏంజెల్స్‌లో ఉన్నాడు....వారానికొకరోజు మాతో మాటాడతాడు...నేను సాధారణంగా ఇల్లు కదలను....ఈ వయసులో ఇంకా పై దేశాలెందుకని అనిపిస్తుంది."

నరసింహం ఆయన కళ్ళలోకే చూస్తున్నాడు. ఆయన కళ్ళలో ఏదో దివ్యకాంతి...

ఏమాత్రం అవకాశం ఉన్నా, ఉద్యోగమనో, చదువనో, డబ్బు సంపాదించాలనో విదేశాలకు వెళ్ళి అక్కడే ఉండిపోవాలనే ఆలోచనే సామాన్యంగా కన పడుతున్న రోజుల్లో ఈయన...

"మీలో మా కాలేజీ - కాదు - మన కాలేజీ నిజవైభవాల వెలుగు కన పడుతోంది."

నరసింహం బయటకు అనకుండా ఉండలేకపోయాడు.

"అది కేవలం మీ అభిమానమే....ఒక కాలేజీలో చదువుకున్నవాళ్ళం ఒకరిమీద ఒకరికి ఇలాంటి మమకారం ఉండడం సహజమే"

కాసేపటికిందట గులాబీలు కోసుకొచ్చినాయన శర్మగారిదగ్గర సెలవు తీసుకొని వెళ్ళిపోయారు.

"ఆయనకు గాలివానంటే ఏమాత్రం భయంలేదు" చిరునగవుతో అన్నారు శర్మగారు.

నరసింహానికి ఆయన కాలాన్ని వృధా చేస్తున్నాననిపించింది.

"నా కాలానికి ఇక ప్రత్యేకమైన విలువేమీ లేదు. దైవకృప నా ఎడల పరిపూర్ణంగా ఉంది...."

"తమ పిల్లలు"

"పెద్దాడు అమెరికాలో....చిన్నాడు ఢిల్లీలో....అమ్మాయి అత్తారింట్లో....ప్రస్తుతం మా ఆవిడ అమ్మాయిని చూడడానికి వెళ్ళింది. నాకు ఈ ఊరు వదలాలనిపించడంలేదు....ఇది నాన్నగారు కట్టించిన ఇల్లు...ఇదిగో, ఇక్కడే ఆయన పరమపదించారు... నాకూ..."

"మహానుభావులు....ఇన్నాళ్ళూ మిమ్మల్ని చూడడానికి రాకపోవడం నాతో మాటాడతారా అనే సందేహంతోనే...."

"జీవితంలో పైకి రావడానికి కారణం మన ప్రయత్నమూ, దైవకృపా కలసి రావడమే.. దైవకృప ఉంటేనే మన ప్రయత్నమనే ప్రేరణ ఉంటుంది... నేనూ సామాన్యుడినే....మా గురువుల ఆశీర్వచనం నేనెన్నడూ మరువలేను. నేను క్లాసులో కనపడకపోతే శర్మ ఎందుకు రాలేదు' అని అడిగేవారట. ఆయన ముఖం చూసిన వేళా విశేషం...ఒకరోజు...."

నరసింహం ఒళ్ళంతా చెవులు చేసుకుని వింటున్నాడు.

"క్లాసులో ఒక్కతే అమ్మాయి—పాతికమందుగురం మగపిల్లలం....మా ఇంట్లో పద్ధతి పూర్వకాలం పద్ధతి...మూడుపూటలా సంధ్యావార్చేవాడిని. సహస్ర గాయత్రి చేసేవాడిని-మూడవ తరగతినుంచీ...ఆ రోజు అమ్మాయి క్లాసులోకి వచ్చేసరికి ఎవరో కిసుక్కున నవ్వారు.

నేను తలఎత్తి చూశాను.

'ఆమె ముఖాన్న బొట్టు లేదురా!" ఎవరో అన్నారు.

ముందు బెంచీ వదలి చివరకు వెళ్ళి కూచున్నాను.

మరునాటిరోజు క్లాసులో మాస్టారు నన్ను "శర్మా! యూ ఆర్ బీయింగ్ సిల్లీ!" అన్నారు. నాకు తల తీసేసినట్లనిపించింది. నామీద మాస్టారికి కోపం వచ్చింది. కాని కారణం నేను గ్రహించలేకపోయాను. నాకు చాలా భయం వేసింది. అంతకంటె ఎక్కువగా సిగ్గు వేసింది."

శర్మగారు నిజంగా ఆ క్షణాన్న అవమానభారంతో కృంగిపోతున్నట్టు ముఖం లజ్జతో దింపుకున్నారు.

నరసింహానికి ఏదో అడగాలనిపించినా ఊరుకున్నాడు.

"శాస్త్రం చదువుకుంటాం...కాని అది మనల్ని కొంతవరకే ముందుకు తీసుకుని వెళుతుంది. మానవుని మేధ అవధి లేనిది కాదనే నా నమ్మకం.... శాస్త్రం విప్పి చెప్పలేనివెన్నో వున్నాయి... అవి మతంమీద విశ్వాసంవల్ల వచ్చే ఇంట్యూయిషన్ వల్లనే మనకు అవగాహన కొస్తాయి. ఒక సామాన్యమైన సంఘటన నా జీవితసరళినే మార్చింది...." శర్మగారు ఆగి నరసింహం కళ్ళలోకి సూటిగా చూశారు.

"మీ ముందు ఎంతసేపయినా కూచోవాలనే ఉంటుంది." శర్మగారు లోపలికి వెళ్ళి యాష్‌ట్రే పట్టుకొచ్చారు.

"అవసరంలేదులెండి!" నరసింహానికి మొగమాటం వేసింది.

"నాకు తెలుసు ఆ యావ! కానివ్వండి....ఆ సంఘటన నా జీవితంలో మరపురాని కొద్ది సంఘటనల్లో ఒకటి.

"న్యూయార్క్‌లో ఒక ప్రతిష్టాకరమైన క్లబ్బులో మెంబరునయ్యాను. అప్పటికి నాకు ఇరవై నాలుగేళ్ళు ..పెళ్ళయి మూడేళ్ళయింది...మా ఆవిడను తీసుకు వెళ్ళడానికి తగినంత డబ్బు లేదు....యువ శాస్త్రవేత్తగా నన్ను పెద్ద వాళ్ళందరూ ఎరుగుదురు....మంచి మంచి ఖరీదైన సూట్లు కుట్టించుకున్నాను.... సంఘంలో ఉన్నత విద్యాభ్యాసం కోసం వెళ్ళినవారి ఎడల శాస్త్రంలో పరిశోధనలు చేసేవారి ఎడల విశేష గౌరవం ఉండేది...

"ఎంతో అందమైన అమ్మాయిలు పార్టీలలో, క్లబ్బులలో డాన్సు చేస్తుంవారు—నాకూ డాన్సు చెయ్యాలనిపిస్తూ ఉండేది. వాళ్ళు సేవించే పానీయాలంటే మాత్రం నాకు విపరీతమైన భయం. కాని వాళ్ళెవరూ నాచేత నాకు ఇష్టంలేని పనిని ఎప్పుడూ చేయించ ప్రయత్నం చెయ్యలేదు. నిమ్మరసమో, నారింజ రసమో తీసుకునేవాడిని....

"ఒక ప్రఖ్యాత శాస్త్రవేత్త ఇంటికి పార్టీకి మా ప్రొఫెసర్‌గారు నన్ను తీసుకుని వెళ్ళారు...ఆ శాస్త్రజ్ఞుడి భార్యా, కుమార్తె, ఇద్దరూ ఎంతో ఆప్యాయంగా నన్ను పలకరించి మర్యాద చేశారు. మా ప్రొఫెసర్ నా గురించి చాలా మెచ్చుకోలుగా మాటలు చెప్పారు. ఆ చిన్నదాని అందం వర్ణనాతీతంగా వుంది.

"భారతీయుడిననీ-వాళ్ళ అలవాట్లను కొంతలో కొంత తెలిసినవాడిననీ కాబోలు నా బెరుకు పోయేటట్టుగా నా ముందే ఆ అమ్మాయి కూచుని పిచ్చాపాటీ మాటాడాక డాన్స్ మొదలయ్యేముందు "నాతో డాన్స్ చేస్తారా?" అని అడిగింది.

నేను లేవబోయాను. లేచానేమో కూడా.

ఒక్క క్షిప్తలో నా మనస్సులో ఏదో వికాసం వెల్లివిరిసింది.

"క్షమించాలి. నాకు కొంచెం తలనొప్పిగా ఉంది" అన్నాను. నా ముఖకవళికలలో ఆమె ఏమి గమనించిందో వెళ్ళి ఆమె తల్లిని వెంటబెట్టుకుని వచ్చింది.

డాన్స్ మొదలైంది. నేను పక్క గదిలోకి వెళ్ళాను. మా ప్రొఫెసర్ అక్కడికి వచ్చారు కొంతసేపటికి.

"డాక్టర్ వద్దకు తీసుకెళ్ళనా?" అంటూ గృహిణి వచ్చింది.

"నే తీసుకు వెళతా!" అంటూ ప్రొఫెసర్‌గారు నా వెంట వచ్చారు.

"నా ముఖం సిగ్గుతో మండిపోతుంది. ఇన్నిసార్లు ఇన్ని పార్టీలు చూశానే. వాళ్ళ జీవిత విధానం తెలియనివాడిని కానే.... ఈరోజు ఎందుకిలా జరిగింది?

"మా ప్రొఫెసర్ నన్ను గదివరకూ దిగబెట్టి వెళ్ళిపోయారు.

"నన్ను నేను ఆత్మ పరిశోధనకు గురి చేసుకున్నాను. నాకు తలనొప్పి కాదు. ఏదో విద్యుద్ఘాతం తగిలినట్టనిపించింది.

"ఒక్క క్షణంలో నేనేమిటో, నా వారసత్వమేమిటో కోటి సూర్యుల వెలుగుతో నా కళ్ళముందు సాక్షాత్కరించింది.

ఏ రోజుకి ఆ రోజు నా అనుభవాలని ఒక పుస్తకంలో రాసుకుంటూ ఉండేవాడిని. అందులోనుంచి కొన్ని భాగాలను ఎత్తి ఇంటికి రాస్తూ ఉండేవాడిని. నా రచన ఉద్దేశ్యం నన్ను నేను లోతుగా ఆకళింపు చేసుకునే ప్రయత్నమే.... ఆ రోజు రాత్రి నా ఆలోచనలన్నిటినీ కాగితంమీద అక్షర రూపంలో పెట్టాలనుకున్నాను. రాత్రంతా ఏమిటేమిటో రాసేశాను. తెల్లవారేక ముక్తసరిగా మూడు ముక్కలే ఉంచి మిగిలినది కొట్టేశాను. 'ప్రొఫెసర్ స్మిత్‌గారితోపాటు జాన్సన్స్ ఇంటికి పార్టీకి వెళ్ళాను....ఆ అమ్మాయి అందం వర్ణనాతీతం....ఆమె నన్ను ఆమెతో డాన్స్ చెయ్యడానికి రమ్మని పిలిచింది. ఆమె ముఖంలో ఏదో ఆకర్షణ. చటుక్కున లేచి వచ్చేశాను.' నాకు ఒక్కటే అనిపిస్తుంది. మనసుతో కాపురం చేస్తున్న నా భార్యకు విడమరచి రాయలేని పని చేయకూడదని.

ఆ సంఘటన నాలో ఒక కొత్త ఆలోచనని రేకెత్తించింది

మనం కొన్ని పనులు చెయ్యలేము. చెయ్యకూడదు. మన నెత్తుటిలో ఉన్న ఊపిరి, మన విశ్వాసం, మన ఆలోచనా వేదం... శాస్త్రాధ్యయనం, శాస్త్రీయ గాహనా ఆధ్యాత్మికతవంకే మనసుని తీసుకు వెళతాయని నా నమ్మకం....

అందుకే నాకు మన గడ్డమీదే శేషజీవితం గడపాలనే కోరిక,...మిమ్మల్ని విసిగిందానేమో! మీరు నాయందు దయ ఉంచి సౌందర్యలహరి ఒకసారి చదివి వినిపిస్తే మీకు ఎప్పుడూ ఋణపడి ఉంటాను. ఇంటర్‌వరకూ సంస్కృతం చదువుకున్నాను కాని గురుముఖంగా శ్రవణం చెయ్యటంలోనే ఆనందం ఉంటుంది!"

"ఎంతమాట! రేపటినుంచే ప్రారంభం చేద్దాం. నేను పండితుడనవి కాదు కాని మీ దగ్గర చదవాలంటేను ముందే కొంత జాగ్రత్తపడి చదువుతానని....మీరు ఏమీ అనుకోకపోతే....చిన్న మనవి...మీవాళ్ళు ఇంట్లో లేరంటున్నారు. నాతోపాటు భోజనానికి...."

"ఎప్పుడయినా తప్పక వస్తాను. కాని నేను తినేది కేవలం చప్పిడి కాబట్టే మిమ్మల్ని భోజనానికి ఉండమనలేకపోయాను....నా వంట నేనే చేసుకోగలను. అదే నాకు తృప్తి."

నరసింహం లేచి చేతులు జోడించి

వచ్చేముందు ఫోన్ చేస్తా మరి... నాకు శెలవా!" అంటూ లేచాడు

గేటుదాటి బయటకు వచ్చేసరికి మబ్బులు విడిపోయాయేమో భళ్ళున వెలుగు వచ్చింది.

ఆ వెలుగులో పసిమి ఉంది. ఆహ్లాదం ఉంది. వైభవం ఉంది.

ముందుకు నడుస్తుంటే జేబులో సిగరెట్టు పెట్టె గుచ్చుకుంటున్నట్టనిపించి చటుక్కున పైకి తీసి రోడ్డువారకు విసిరేశాడు.

వానలో నిశ్చలంగా నుంచున్న చెట్ల ఆకులు కడిగిన ముత్యాల్లా అస్తమిస్తున్న సూర్యుని కిరణాలలో మిలమిలలాడిపోతుంటే ఒక్కక్షణం ఆగి తోట వంక తృప్తిగా చూసి ముందుకు నడిచాడు నరసింహం. ❋

# నాకు తెలిసింది

చేపలు కూడా
గాలాలు విసరగలవని
నీ కళ్ళను చూసినపుడు ... ... ...

మందహాసాలు
చంద్రహాసాలై
ఎదదలను గాయపరచగలవని
నీ పెదవులు చెప్పినపుడు ... ... ...

ముఖాలు కూడా
మొగ్గరాలు వన్నగలవని
నీ మోము తమ్మిలో
నా మనోభ్రమరం చిక్కినపుడు ... ... ...

తల నీలాలు
నల్లత్రాచుగా పగబట్టగలవని
నీ వినీల వేణీబంధ సౌందర్యం
విసురుగా బుసకొట్టినపుడు ... ... ...

మౌనంలోనే
మధురమైన రాగాలున్నవని
నీ మూగ భాషలు విన్నపుడు ... ... ...

అమాయకత్వం కూడా
అఘాయిత్వం చేయగలదని
నా హృదయాన్ని
నీవు కొల్లగొట్టినపుడు ... ... ...

శ్రీ కావూరు పాపయ్య శాస్త్రి